APBIL/26/A4072.

గోదావరి భవిష్యత్

# వార్త

గోదావరి స్పెషల్ బులిటెన్

తెలుగు దినపత్రిక

సంపుటి : 1 | సంచిక : 52 | జూలై 13 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల : 2 రూ.

## మళ్లీ హోర్ముజ్ మూత

దుబాయ్/వాషింగ్టన్/న్యూఢిల్లీ, : పశ్చిమాసియాలో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. అమెరికా–ఇరాన్ మధ్య ఇటీవల మొదలైన పరస్పర దాడులు మరింతగా ముదిరాయి. హోర్ముజ్ జలసంధిలో తమ అనుమతి లేకుండా ప్రయాణిస్తోందంటూ మరో వాణిజ్య నౌకపై ఇరాన్ దాడి చేసింది. దీనిపై ఆగ్రహించిన అమెరికా వెంటనే ఇరాన్‌పై విరుచుకుపడింది. ప్రతిగా ఇరాన్ కూడా గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపైకి డ్రోన్లు, క్షిపణులు ప్రయోగించింది. అంతేకాదు హోర్ముజ్ జలసంధిని తిరిగి మూసేస్తున్నట్టు ప్రకటించింది. అయితే ఇరాన్ దాడి చేసిన వాణిజ్య నౌకలో 11 మంది భారతీయులు ఉండగా.. అందులో పదిమందిని రక్షించారు. మరొకరు గల్లంతయ్యారు. అమెరికాతో ఇటీవలి అవగాహన ఒప్పందం తర్వాత ఇరాన్ హోర్ముజ్ జలసంధిని తెరిచినా.. తమకు సమాచారమిచ్చి, టోల్ చెల్లించిన నౌకలను మాత్రమే, అదీ తాము నిర్దేశించిన మార్గం మీదుగా ప్రయాణించేందుకు అనుమతిస్తోంది. ఆ మార్గం ఇరాన్ తీరానికి దగ్గరగా ఉంది. మరోవైపు ఒమన్ తీరానికి సమీపంలోని మరో మార్గం నుంచి ప్రయాణించేలా కంటెయినర్ నౌకలు, చమురు ట్యాంకర్లకు అమెరికా సూచనలు చేస్తోంది.

## క్షిపణుల తయారీ బాధ్యతలు ప్రైవేట్‌కు!

న్యూఢిల్లీ, : దేశ రక్షణ రంగంలో కీలక సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. అత్యాధునిక క్షిపణుల తయారీ, అభివృద్ధిలో ప్రైవేట్ సంస్థలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించింది. దీనిలో భాగంగా డీఆర్‌డీవో అభివృద్ధి చేసిన గగనతలం నుంచి గగనతలంలోకి ప్రయోగించే అస్త్ర మార్క్ 2 మిస్సైల్ (180–200 కి.మీ. దూరం)ను తయారు చేయడానికి రక్షణ శాఖ త్వరలోనే రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్ (ఆర్‌ఎ?ఫపీ) జారీ చేయనుంది. ఇందులో ఐకామ్, టాటా గ్రూప్, అదానీ, మహీంద్రా, భారత్ ఫోర్జ్ తదితర ప్రముఖ భారతీయ కంపెనీలు పాల్గొనే అవకాశం ఉంది. రక్షణ రంగంలో ఆత్మనిర్భరత సాధించడంతో పాటు దేశ సాయుధ దళాల అవసరాలు తీర్చడం, మిత్రదేశాల నుంచి పెరుగుతున్న ఎగుమతి డిమాండ్లను దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్షిపణుల తయారీ బాధ్యతల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థ భారత్ డైనమిక్స్ లిమిటెడ్ (బీడీఎల్) ఈ డిమాండ్‌ను పూర్తిగా తీర్చలేకపోవడం కూడా ఓ కారణంగా కనబడుతోంది.

# ఆలమట్టిలోకి 1,31,940 క్యూసెక్కులు



బళ్లారి : కర్ణాటకలోని ఆలమట్టి డ్యాంకు ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. ఆదివారం ఒక్కరోజే 12 టీఎంసీల నీరు చేరింది. ప్రస్తుతం1,31,940 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. 483 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. జలాశయం నిల్వ సామర్థ్యం 123 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 86.061 టీఎంసీలు ఉంది. మహారాష్ట్రలో వరాషలు తగ్గుముఖం పట్టడంతో కృష్ణా నదిలో వరద తగ్గుతోంది. ఈ నేపథ్యంలో ఆలమట్టికి వచ్చే ప్రవాహం కూడా వచ్చే నాలుగు రోజుల్లో బాగా తగ్గుతుందని ఏపీ జలవనరుల శాఖ వర్గాలు అంచనా వేస్తున్నాయి. సోమవారం నాటికి 64,700 క్యూసెక్కులకు తగ్గుతుందని.. క్రమంగా 17వ తేదీకి 8,850 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో మాత్రమే ఉంటుందని అంటున్నాయి. కాగా, తుంగభద్ర జలాశయానికి కూడా వరద తగ్గుతోంది. శనివారం 38,9 77 క్యూసెక్కులుగా నమోదైన ఇన్‌ఫ్లో.. ఆదివారానికి 25,120 క్యూసెక్కులకు పడిపోయింది. జలాశయం సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 22.948 టీఎంసీల నిల్వ ఉంది. ఆలమట్టి దిగువన నారాయణపూర్, జూరాలకు ప్రవాహం లేకపోవడంతో శ్రీశైలం డ్యాంలోకి చుక్క నీరైనా రావడం లేదు. నాగార్జునసాగర్ పరిస్థితి కూడా ఇంతే. ప్రస్తుతం సాగర్‌లో 138.03 టీఎంసీల నీరుంది. పులిచింతలలో ఆదివారం 30.99 టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. ఎగు వ నుంచి నీటి ప్రవాహం నిలిచిపోయింది.

రాజమహేంద్రవరం/ధవళేశ్వరం: గోదావరికి వరద తగ్గింది. ఆదివారం ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి సముద్రంలోకి 47,842 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈనెల 8 నుంచి ప్రవా హం మొదలు కాగా.. మర్నాడు దిగువకు 1,15,480 క్యూసెక్కులను వదిలారు. ఇబ్రహీంపట్నం: పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పరుగు పరుగున వచ్చిన గోదావరి వరద జలాలు పోలవరం కుడికాలువ ద్వారా శనివారం రాత్రి కృష్ణానదిలో కలిశాయి. ఆదివారం ఉదయానికి అప్పటి వరకు నీలం రంగులో ఉన్న నది నీరు ఎర్రబారింది. ఓపక్క నీలం రంగు నీరు, మరోపక్క ఎర్రటి నీరు కలిసిన ప్రదేశమైన ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమానికి పర్యాటకులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ దృశ్యా న్ని ఆసక్తిగా తిలకించారు. పట్టిసీమ ద్వారా 20 పంపుల నుంచి 7,080 క్యూసెక్కుల గోదావరి జలాలు కృష్ణమ్మలో కలుస్తున్నాయి. ఇలా వచ్చిన నీటిని కృష్ణా డెల్టాకు సాగునీరుగా విడుదల చేస్తున్నారు.

# బాబు మిత్రులందు పవన్ వేరయా !





ఏపీ సీఎం చంద్రబాబు రాజకీయ జీవితం ఒక అర్ధ శతాబ్దం. ఇంతటి సుదీర్ఘ జీవితంలో బాబుకు ఎంతో మిత్రులు ఉన్నారు. ఆయన ప్రతీ దశలోనూ వారి కనిపిస్తూ ఉంటారు. తొలినాళ్ళలో వైఎస్సార్ బాబు మంచి మిత్రులు. ఇద్దరూ ఒకేసారి ఎమ్మెల్యేలుగా నెగ్గారు, ఒకెసారి మంత్రి పదవులు కాంగ్రెస్ ప్రభుత్వంలో అందుకున్నారు. ఆ తరువాత బాబు టీడీపీలోకి వెళ్తే వైఎస్సార్ కాంగ్రెస్ లోనే ఉన్నారు. ఇక టీడీపీలో కూడా బాబుకు సహచరులలో మంచి మిత్రులు ఉన్నారు. అశోక్ గజపతిరాజు, ఎర్రన్నాయుడు, యనమల రామక్రిష్ణుడు, అయ్యన్నపాత్రుడు వంటి వారు బాబుకు అత్యంత సన్నిహితులు అలాగే మిత్రులుగా చెప్పుకోవాలి. ఇక టీడీపీకి కూడా మిత్రులు ఉన్నారు. అవన్నీ రాజకీయ బంధాలు. ఒక ఎన్నికలో మిత్రులుగా ఉండే పార్టీలు మరో ఎన్నికలో ప్రత్యర్ధిగా మారుతాయి. ఇదిలా ఉంటే టీడీపీ తొలి మిత్ర పక్షం ఇందిరాగాంధీ చిన్న కోడలు మేనకా గాంధీ స్థాపించిన సంజయ్ విచార్ మంచ్. 1983లోనే పొత్తు పెట్టుకుని పోటీ చేసింది. ఆ తరువాత బీజేపీ వామపక్షాలు అలా తలో ఎన్నికల్లో మిత్రులుగా ఉంటూ వచ్చాయి. ఈ మధ్యలో టీఆర్ఎస్ కూడా టీడీపీకి ఒక అసాధారణ సందర్భంలో దోస్త్ గా మారింది. కాంగ్రెస్ కి వ్యతిరేకంగా పార్టీ పెట్టిన టీడీపీకి మరో అనూహ్య సందర్భంలో ఆ పార్టీ కూడా మిత్ర పక్షం అయింది అంటే అదంతా రాజకీయ అనివార్యతగా రాజకీయ సహజ ప్రక్రియగానే తీసుకోవాల్సి ఉంది. ాశ్రీంశీ =ముం – హరీష్ ఎందుకు టార్గెట్...రేవంత్ ఆరోపణల్లో లాజిక్ ? అయితే ఇంతలా మిత్ర బంధాలు నెరపిన టీడీపీకి పవన్ మాత్రం మిత్రుడు కంటే ఎక్కువ అనే చెప్పాలి. పవన్ 2014లో టీడీపీకి జనసేన అధినేత కంటే కూడా ఒక మిత్రుడిగానే బాసటగా నిలిచారు. ఇక 2019 నాటికి జనసేన వేరుగా పోటీ చేసి టీడీపీకి ప్రత్యర్ధిగా మారింది. అయితే 2024 నాటికి మళ్ళీ టీడీపీ కూటమిలో చేరింది. ఈ పన్నెండేళ్ళ ప్రస్థానంలో టీడీపీ జనసేనల అన్న పార్టీల కంటే కూడా బాబు పవన్ ల వ్యక్తిగత స్నేహ బంధం గట్టిగా నిలిచింది. 2018 నుంచి ఒక ఏడాది పాటు మాత్రమే పవన్ బాబు ప్రత్యర్ధులుగా మారారు అంతే. రాజకీయ పార్టీల మితృత్వం సాధారణంగా ఎన్నికల ముందు తరువాత అని మాత్రమే చూడాలి. ఎన్నికలు ముగిసాక ఆ బంధంలో మార్పులు వస్తాయి. అలాగే రాజకీయాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే జనసేన టీడీపీ విషయంలో వీటికి మించి అతీతమైన అనుబంధం ఉంది. అదే శ్రీరామ రక్షగా నిలుస్తోంది. ఏపీ అభివృద్ధికి తొలి ప్రాధాన్యత పవన్ ఇస్తారు. అలాగే చంద్రబాబుని ఆయన మంచి పాలకుడిగా పవన్ గుర్తిస్తారు. అలాగే పవన్ లోని నిబద్ధతకు బాబు సైతం ఆకర్షితులు అవుతున్నారు. ఆయన అందరి లాంటి మిత్రుడు కాదు అన్నది కూడా బాబు గుర్తించి మరీ ఆయనకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తారు. పవన్ కళ్యాణ్ ఇటీవల ముంబైలోకి కోకిలాబెన్ ఆసుపత్రిలో తన భుజానికి శస్త్ర చికిత్స చేసుకున్నారు. చంద్రబాబు ప్రత్యేకంగా పనిగట్టుకుని ఆసుపత్రికి వెళ్ళి మరీ పవన్ ని పరామర్శించడం ఈ ఇద్దరి మధ్య అనుబంధాన్ని చాటి చెబుతోంది. చంద్రబాబు పవన్ ఆరోగ్యం విషయంలో చూపించిన శ్రద్ధ కూడా ఈ సందర్భంగా అంతా చెప్పుకుంటున్నారు. ఒక మిత్ర పక్షం నాయకుడు కోసం బాబు ఇలా వెళ్ళడం అన్నది రాజకీయాలకు అతీతంగా వారిద్దరి మధ్య ఉన్న బంధాన్ని చాటుతోంది. ఈ బంధం గట్టిది మరి : చంద్రబాబు పవన్ ల మధ్య ఏజ్ గ్యాప్ ఉంది. అనుభవం విషయం తీసుకుంటే బాబు అత్యంత సీనియర్. అదే సమయంలో ఇద్దరి మధ్య ఒక సారూప్యత ఉంది. అదే ఏపీ అభివృద్ధి అన్నది. ఈ లక్ష్యం కోసం ఇద్దరూ చేతులు కలిపారు. అందుకే ఈ బంధం బహు గట్టిగా మారింది అని అంటున్నారు. ఇక చంద్రబాబు విషయంలో ఒక విమర్శ ఉంది, మిత్రులను ఆయన రాజకీయంగా సాయం తీసుకుని ఆనక పట్టించుకోరు అని. దానికి పూర్తి విరుద్ధం జనసేనతో బంధం. ఈ రెండు పార్టీల మధ్య దృఢమైన బంధానికి ఎన్నో ఉదాహారణలు ఉన్నాయి. తాజాగా బాబు పరామర్శ దానిలో ఒకటిగా చెబుతున్నారు.

## బ్యాంకాక్‌లోని పబ్‌లో ఘోర అగ్నిప్రమాదం.. 27 మంది మృతి..

బ్యాంకాక్‌లోని ఓ పబ్‌లో ఘోర అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 27 మంది మృతి చెందగా.. 63 మందికి గాయాలయ్యాయి. గాయపడ్డవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో స్థానికులు, విదేశీయులు ఉన్నారు. ఆదివారం రాత్రి ఈ దారుణం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రాథమిక దర్యాప్తు వివరాల మేరకు.. చతుచక్ ప్రాంతంలోని 'రోంగ్ బీర్ నా లాడ్‌ప్రావ్' పబ్‌లో ఆదివారం రాత్రి 11:57 గంటల సమయంలో.. లైవ్ బ్యాండ్ సంగీత ప్రదర్శన ఇస్తుండగా వేదిక సమీపంలోని సర్క్యూట్ బ్రేకర్ నుంచి పొగలు రావటం మొదలైంది. ఆ వెంటనే పబ్‌లో కరెంట్ పోయింది. క్షణాల్లోనే పెద్ద పేలుడు సంభవించింది. వేదిక ముందు భాగం నుంచి మంటలు వేగంగా వ్యాపించాయి. పబ్ లోపల ఇంటీరియర్ డెకరేషన్ కోసం ఉపయోగించిన వస్తువుల కారణంగా సీలింగ్ ద్వారా మంటలు అత్యంత వేగంగా పబ్ అంతటా వ్యాపించాయి. పబ్ అత్యవసర ద్వారాల వద్ద స్టాళ్లు, టేబుళు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు బయటకు రాకుండా దారులు మూసుకుపోయాయి. దట్టమైన పొగ, చీకటి కారణంగా ప్రాణాలు కాపాడుకోవడానికి చాలా మంది పబ్ వెనుక భాగంలో ఉన్న రెస్ట్‌రూమ్‌ల వైపు పరిగెత్తారు.

## ఖమేనీ అంత్యక్రియల్లో మాస్క్ మ్యాన్ ఎవరు?

### తొలిసారి ప్రజల ముందుకు కొత్త సుప్రీం లీడర్?




ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణం.. ఆ తర్వాత జరిగిన పరిణామాలు అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్ర సంచలనం సృష్టిస్తున్నాయి. ఖమేనీ అంత్యక్రియల సందర్భంగా జరిగిన ఒక సంఘటన ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఆ కార్యక్రమంలో ముఖానికి నల్లటి మాస్క్, తలపై క్యాప్ ధరించి పాల్గొన్న వ్యక్తి ఎవరు అనే అంశంపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఆ 'మాస్క్ మ్యాన్' ఎవరు? 'ఇరాన్ ఇంటర్నేషనల్' నివేదికల ప్రకారం.. ఆ రహస్య వ్యక్తి ఖమేనీ మనవడు, ముస్తఫా ఖమేనీ కుమారుడైన మహమ్మద్ జావెద్ ఖమేనీ అని తెలుస్తోంది. ఫిబ్రవరి 28న జరిగిన అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త వైమానిక దాడుల్లో జావెద్ తీవ్రంగా గాయపడ్డారని, ఆయన శరీరంలో పెద్ద భాగం కాలిపోవడం వల్లే ముఖాన్ని పూర్తిగా కప్పుకుని అంత్యక్రియలకు హాజరయ్యారని ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై ఇరాన్ ప్రభుత్వం ఇప్పటివరకు ఎటువంటి అధికారిక ప్రకటన చేయకపోవడంతో ఈ వార్తలపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ ఎక్కడ? ఇరాన్ అత్యున్నత పదవైన సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన మొజ్తబా ఖమేనీ ఇప్పటివరకు ఒక్కసారి కూడా బహిరంగంగా ప్రజల ముందుకు రాకపోవడం గమనార్హం. తండ్రి అంత్యక్రియలతో పాటు, తన సోదరి, కూతురు, కోడలు, మనవరాలి అంతిమ సంస్కారాల్లో కూడా ఆయన కనిపించలేదు. ముస్తఫా, మేసమ్, మసౌద్ వంటి ఖమేనీ ఇతర కుమారులు పాల్గొన్నా.. మొజ్తబా గైర్హాజరు కావడం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై భిన్నమైన వాదనలు వినిపిస్తున్నాయి. ఫిబ్రవరి దాడుల్లో మొజ్తబా కూడా గాయపడ్డారని కొందరు విశ్లేషకులు భావిస్తుండగా, భద్రతా కారణాల దృష్ట్యా ఆయనను అజ్ఞాతంలోకి తీసుకెళ్లారని మరికొందరు పేర్కొంటున్నారు. ఈ గందరగోళం మధ్య, జూలై 23న టెహ్రాన్‌లో అయతుల్లా అలీ ఖమేనీ స్మారక సభను ప్రభుత్వం ప్రకటించింది. అలీ ఖమేనీని "అమరవీరుడు, ముజాహిద్ ఇమామ్"గా పేర్కొంటూ ఈ కార్యక్రమం మొజ్తబా ఖమేనీ పర్యవేక్షణలోనే జరుగుతుందని ప్రభుత్వం వెల్లడించింది. దీంతో ఆ రోజున మొజ్తబా ఖమేనీ తొలిసారిగా బహిరంగంగా ప్రజల ముందుకు వస్తారా? లేక మళ్ళీ గైర్హాజరవుతారా? అని ప్రపంచవ్యాప్తంగా నిఘా సంస్థలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. మొజ్తబా తొలి బహిరంగ ప్రసంగం లేదా దర్శనం ఇరాన్ అంతర్గత రాజకీయాలతో పాటు.. మధ్యప్రాచ్య భద్రతా పరిస్థితులపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది.

# విశాఖలో భూప్రకంపనలు.. అతి చేస్తున్న మీడియా

ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతంలో ఆదివారం తెల్లవారుజామున స్వల్ప భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ భూకంపం ప్రభావం విశాఖపట్నంతో పాటు కాకినాడ నుంచి విజయనగరం వరకు పలు ప్రాంతాల్లో స్వల్పంగా కనిపించింది. ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్ రిపోర్ట్ ప్రకారం.., ఆదివారం తెల్లవారుజామున 5:05 గంటల సమయంలో రిక్టర్ స్కేలుపై 4.5 తీవ్రతతో ఈ భూకంపం సంభవించింది. కాకినాడ తీరానికి దాదాపు 225 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో 10 కిలోమీటర్ల లోతున దీని కేంద్రం ఉన్నట్లు అధికారులు ధృవీకరించారు. ఈ భూప్రకంపనలు చాలా స్వల్పంగా ఉండటంతో ఎటువంటి ప్రాణనష్టం గానీ.. ఆస్తి నష్టం గానీ సంభవించలేదు. తెల్లవారుజామున 5 గంటల సమయం కావడంతో అత్యధిక శాతం మంది ప్రజలు గాఢ నిద్రలో ఉండటం వల్ల అసలు భూప్రకంపనలు వచ్చాయనే విషయమే చాలామందికి తెలియలేదు. మేల్కొని ఉన్న కొద్దిమంది మాత్రమే స్వల్పంగా భూమి కంపించినట్లు గుర్తించారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. భయపడాల్సిన పరిస్థితి అస్సలు లేదని అధికారిక వర్గాలు స్పష్టం చేశాయి. అయినా ఈ చిన్న విషయాన్ని కొందరు సామాజిక మాధ్యమాల్లో, వార్తల్లో పెద్దదిగా చూపే ప్రయత్నం చేశారు. వాస్తవం ఇలా ఉంటే కొన్ని మీడియా సంస్థలు మాత్రం వ్యూస్, టీఆర్పీ రేటింగుల కోసం ఈ ఘటనపై తీవ్రంగా –అతి– చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే ప్రయత్నం చేయడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. --వైజాగ్ లో భారీ భూకంపం-- అంటూ దారుణమైన, భయానకమైన హెడ్డింగులతో లైవ్ ప్రోగ్రామ్‌లు, తప్పుడు థంబ్‌నైల్స్ పెట్టి సోషల్ మీడియాలో, యూట్యూబ్ ఛానెళ్లలో హల్చల్ చేయడం స్థానిక ప్రజలకు అస్సలు నచ్చడం లేదు. వాస్తవ తీవ్రతను దాచిపెట్టి... కేవలం క్లిక్ బైట్స్– విజిబిలిటీ పెంచుకోవాలనే కొన్ని మీడియా ఛానెళ్ల మూర్ఖత్వాన్ని నెటిజన్లు, విశ్లేషకులు తప్పుపడుతున్నారు. ఇలా మీడియా అతి చేయడం విశాఖ విషయంలో ఇదే మొదటిసారి కాదు. ఇటీవల పరవాడ పరిసరాల్లోని ఫార్మా కంపెనీలలో జరిగిన కొన్ని చిన్నపాటి, చెదురుముదురు ప్రమాదాలపైనా కొన్ని మీడియా సంస్థలు ఇలాగే ఘోరమైన హెడ్డింగులు పెట్టి టీఆర్పీ గేమ్స్ ఆడటానికి ప్రయత్నించాయి. పరిశ్రమల్లో జరిగిన చిన్న సాంకేతిక లోపాలను కూడా నగరానికేదో ముప్పు ముంచుకొచ్చినట్లు కలరింగ్ ఇస్తూ వార్తలు ప్రసారం చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. ఉన్నది ఉన్నట్టుగా చెప్పకుండా అబద్ధపు హైప్ క్రియేట్ చేయడం బాధ్యతారాహిత్యమే అవుతుందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి విపత్తులు లేదా ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రజలను అప్రమత్తం చేయడం, వారికి ధైర్యం చెప్పడం మీడియా ప్రాథమిక బాధ్యత. అంతేకాని చిన్నపాటి స్వల్ప ప్రకంపనలను కూడా భారీ భూకంపాలుగా చిత్రీకరించి సమాజంలో అనవసర భయాందోళనలు సృష్టించడం ఎంతమాత్రం సమర్థనీయం కాదు. తప్పుడు ప్రచారాలకు అడ్డుకట్ట వేస్తూ..బాధ్యతాయుతమైన జర్నలిజం వైపు మీడియా అడుగులు వేయాలని..రేటింగుల పిచ్చిని పక్కనపెట్టి వాస్తవాలను మాత్రమే ప్రజల ముందుంచాలని విశ్లేషకులు హితవు పలుకుతున్నారు. భూకంపంపై ప్రజా స్పందన : విశాఖపట్నం తీరంలో సంభవించిన స్వల్ప భూప్రకంపనలపై సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు భిన్నమైన అనుభవాలను, అభిప్రాయాలను షేర్ చేస్తున్నారు. విశాఖ నగరంలోని మద్దిలపాలెం, మధురవాడ, సీతమ్మధార, ఎన్ఏడి, కూర్మన్నపాలెం.. అలాగే విజయనగరం వంటి పరిసర ప్రాంతాల ప్రజలు తెల్లవారుజామున 5:00 నుండి 5:15 గంటల మధ్యలో తమకు ఎదురైన అనుభవాలను లైవ్ చాట్‌లో రాసుకొచ్చారు. కొందరు నిద్రలో ఉన్నప్పుడు వింత శబ్దాలు వచ్చాయని.. మరికొందరు బెడ్‌రూమ్‌లోని మంచం, అల్మారా కొన్ని సెకన్ల పాటు కదిలాయని పేర్కొన్నారు. ఉదయాన్నే పూజ చేసుకుంటున్న సమయంలో లైట్‌గా షేక్ అవ్వడంతో మొదట భ్రమ అనుకున్నామని... కానీ మీడియా లైవ్ చూశాకే అది భూకంపమని తెలిసిందని కొందరు నెటిజన్లు ధృవీకరించారు. ఈ ప్రకంపనలపై కొందరు నెటిజన్లు ఆందోళన వ్యక్తం చేయగా.. మరికొందరు మాత్రం --ఇది చాలా స్వల్ప తీవ్రత కలిగింది..అంతా పిచ్చ లైట్, భయపడాల్సిన పనిలేదు-- అంటూ ధైర్యం చెప్పారు. ఇదే సమయంలో ఈ ప్రకృతి పరిణామాన్ని కొందరు దైవచింతనతో – పాపపుణ్యాలతో ముడిపెడుతూ కామెంట్లు చేయడం గమనార్హం. సమాజంలో పాపాలు పెరిగిపోవడం వల్లే భగవంతుడు ఇలాంటి హెచ్చరికలు ఇస్తున్నాడని... ఇప్పటికైనా మనుషులు మంచితనంతో నడుచుకోవాలని దైవభక్తితో కూడిన హితవులు పలికారు. మొత్తానికి మీడియా చూపిస్తున్న అతితో సంబంధం లేకుండా, నెటిజన్లు తమ స్వంత అనుభవాలను షేర్ చేయడంతో వాస్తవం ఏమిటో అవగతమవుతోంది.

RNI AP BIL14872/2024
గోదావరి భవిష్యత్ వార్త
గోదావరి స్పెషల్ బులిటెన్
తెలుగు దినపత్రిక



## తాగి వీరంగం సృష్టించిన యువకుడి అరెస్ట్



గోకవరం జూలై 12జి ఎస్ బి వార్త : గోకవరం పోలీస్ స్టేషన్ పరిధిలోని గోకవరం బస్టాండ్ ప్రాంతంలో తాగిన మత్తులో వీరంగం సృష్టించి, ప్రజాశాంతికి భంగం కలిగించిన తంటికొండ గ్రామానికి చెందిన పిల్లల సురేంద్ర అనువానిని శనివారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై వి.ఎన్.వి.పవన్ కుమార్ తెలిపారు. అనంతర అతడిని రాజమహేంద్రవరం 1వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ వారి ఎదుట హాజరుపరచగా, 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై పవన్ కుమార్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా, మరి ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు అలవాటుపడి చట్టవ్యతిరేక, ప్రజా శాంతికి విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా నేరాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా తన సెల్ నంబర్ 9440904830 కు సమాచారం అందించాలని కోరారు.

## రాజానగరం: నాటు తుపాకీతో కాల్పులు.. ఇద్దరి అరెస్ట్



గోకవరం జూలై 12 జిఎస్బి వార్త : బ్రిడ్జ్ కౌంటీలో రెండు కుక్కలను నాటు తుపాకీతో కాల్చి చంపిన కేసులో ఇద్దరు నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. రాజనగరం జ× వీరయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. సదరు ప్రాంతంలో కుక్కల బెడద ఎక్కువగా ఉండటంతో అక్కడి నివాసితులతో కుదుర్చుకున్న ఒప్పందం మేరకే రాజానగరానికి చెందిన మాణిక్యం, శంకర్ గురువారం ఈ చర్యకు పాల్పడ్డారు. నిందితుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## సీనియర్ నాయకులు బత్తుల వెంకట్రావు కుటుంబాన్ని ఎమ్మెల్యే బలరామకృష్ణ పరామర్శ



గోకవరం ( జి ఎస్ బి వార్త ) జూలై 12 : అచ్యుతాపురం గ్రామ సీనియర్ నాయకులు బత్తుల వెంకట్రావు మృతి చెందడంతో రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ ఆదివారం ఉదయం వారి కుటుంబాన్ని పరామర్శించారు. అచ్యుతాపురం గ్రామంలోని వెంకట్రావు ఇంటికి చేరుకున్న ఎమ్మెల్యే బలరామకృష్ణ, వెంకట్రావు సతీమణిని, కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఆయన సోదరులు బాపన్నదొర, త్రిమూర్తులతో కొద్దిసేపు మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈకార్యక్రమంలో జనసేన పార్టీ రాజానగరం నియోజకవర్గ జనసేన సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ లు కోలా మల్లికార్జునరావు, బత్తుల వెంకటరామకృష్ణ, అదేవిధంగా గుర్రాల చలం, బత్తుల వీరబాబు, సత్తిబాబు, బత్తుల రాజేంద్ర, రాజా, మండల తెలుగుదేశం పార్టీ రైతు విభాగం అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతీ పౌరుడు ఓటు హక్కును కాపాడుకోవాలి

### ఓటర్లకు సూచించిన గోకవరం తహశీల్ధార్ రామకృష్ణ



గోకవరం జూలై 12 ( జి ఎస్ బి వార్త ) : మీ ఓటు భద్రంగా ఉండాలంటే ఎన్యూమరేషన్ ఫారమ్ ను జూలై 14లోపు తప్పనిసరిగా సమర్పించాలని గోకవరం మండల తహశీల్దార్ పినిశెట్టి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు పూర్తి చేసిన ఎన్యుమరేషన్ ఫారమ్‌ను మీ బి ఎల్ ఓ కు ఇవ్వాలని,గడువులోపు సమర్పించకపోతే జూలై 21న విడుదలయ్యే ముసాయిదా ఓటర్ల జాబితాలో మీ పేరు లేకపోయే అవకాశం ఉందన్నారు. ఎన్యుమరేషన్ ఫారమ్ ప్రతి ఒక్కరికి అందజేయడం జరిగిందన్నారు..మీ ఓటు హక్కును కాపాడుకోవాలంటే జూలై 14 చివరి తేదీ చివర తేదీ అని ఇది ప్రతి పౌరుడు మర్చిపోవద్దని తెలిపారు.

## మహిళలకు కంబాల శ్రీనివాసరావు కానుక..

### భూపాలపట్నంలో 610 మంది మహిళలకు పట్టుచీరలు ఉచితంగా పంపిణీ



గోకవరం జూలై 12 (జి ఎస్ బి వార్త) : తూర్పుగోదావరి జిల్లా, రాజానగరం మండలం, భూపాలపట్నం గ్రామ దేవత గరగాలమ్మ జాతర మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వహిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ జగ్గంపేట నియోజకవర్గం బీఎల్ఏ-1 కంబాల శ్రీనివాసరావు గ్రామ మహిళలకు 610 పట్టు చీరలను ఉచితంగా పంపిణీ చేశారు. తొలిత ఆయనకు గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఘన స్వాగతం పలికి, శాలువ కప్పి పూలమాలతో సత్కరించారు. మహిళలు హారతులు పట్టారు. అలయంలో అమ్మవారిని దర్శించుకుని, అమ్మవారికి తొలి చీరను సమర్పించారు జాతర మహోత్సవాల సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని పట్టు చీరలను స్వీకరించారు. ఈ సందర్భంగా కంబాల శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో ప్రజాసేవ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తున్నామన్నారు మహిళల సంక్షేమం మరియు ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తూనే ఉంటానని తెలిపారు. గ్రామ ప్రజలు, మరియు మహిళలు ఈ సేవా కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ, కంబాల శ్రీనివాసరావు గారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు, గ్రామస్తులు, మహిళలు, ఆలయ కమిటీ సభ్యులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## గాన కోకిల శ్రీమతి ఎస్ జానకి మృతికి సంతాపాన్ని ప్రకటించిన గోకవరం మండల కళాకారులు



గోకవరం జూలై 12( జి ఎస్ బి వార్త) : ప్రముఖ సినీ నేపథ్య గాయని శ్రీమతి ఎస్ జానకి అనారోగ్యంతో మృతి చెందిన సందర్భముగా గోకవరంలో మండల కళాకారుల గౌరవాధ్యక్షుడు వరసాల ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ జానకి చిత్రపటానికి పూలమాలలు వేసి మౌనాన్ని పాటించి నివాళులర్పించారు ఈ సందర్భంగా వరసాల ప్రసాద్, ఉంగరాల ఆది విష్ణు తదితరులు మాట్లాడుతూ భారతీయ సినీ రంగానికి ఎస్ జానకి మృతి తీరనిలోటని ఆమె చిన్నతనములో రాజమహేంద్రవరంలో సంగీతాన్ని నేర్చుకుని సినీ రంగానికి వెళ్లి ఇంతింతై వటుడింతై అన్నట్లుగా అత్యున్నతమైన నేపథ్య గాయనిగా ఉన్నత శిఖరాల నిర్వహించి కీర్తి ప్రతిష్టలు సంపాదించు కున్నారని కళకు కులముగాని మతముగాని ప్రాంతము గాని భాష గాని అడ్డుకావని తెలుగు తమిళ కన్నడ మలయాళ భాషలలో సుమారు 45 వేల పాటలు పాటి దేశవ్యాప్తంగా కోట్లాది ప్రజల అభిమానాన్ని పొందిన జానకమ్మ ప్రజల హృదయాలలో చెరగని ముద్ర వేశారని ఆమెభౌతికంగా మనలను వీడినప్పటికీ ఆమె పాడిన పాటలు మన హృదయాలలో ఎప్పుడూ ప్రతిధ్వనిస్తూనే ఉంటాయని కళాకారుడికి మరణము ఉండదని ప్రజల హృదయాల్లో జీవించే ఉంటారని ఆమె పవిత్రమైన ఆత్మకు ఉత్తమ గతులు కలగాలని మండల కళాకారుల పక్షాన ఆమెకు ఘన నివాళులు అర్పించామని తెలిపారు ఈ కార్యక్రమంలో గండి నాగేశ్వరరావు, కావేటి అప్పారావు, బొమ్మగంటి కృష్ణ, వల్లూరి శ్రీనివాస శర్మ ,మందపాటి సతీష్ ఏనుగు శ్రీను , నారాయణ రావు చౌదరి, కనిగిరి ధర్మరాజు, కురియాల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

## పిచ్చుక లంకలో ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



ఆత్రేయపురం (జి ఎస్ బి వార్త) జూలై 12 : సోమవారం పిచ్చుకలంకలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పర్యటిస్తున్న సందర్భంగా ఏర్పాటుచేసిన రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఏర్పాట్లను కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆదివారం పరిశీలించారు. అధికారులతో మాట్లాడి కార్యక్రమం ఏర్పాట్ల తీరుతెన్నులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

## ర్యాలీ జగన్మోహిని కేశవ స్వామి వారి నిత్య అన్నప్రసాద వితరణకు విరాళం

ఆత్రేయపురం (జి ఎస్ బి వార్త) జూలై 12 : అనపర్తి మండలం, రామవరం గ్రామ వాస్తవ్యులు కె. వీర్రాఘవరెడ్డి శ్రీమతి లక్ష్మి మాధవి దంపతులు ర్యాలి శ్రీ జగన్మోహిని కేశవ ఁ గోపాల స్వామి వారిని దర్శించుకుని శ్రీస్వామి వారి అన్నదాన పథకము నిమిత్తం రూ.10,116/-లు విరాళంగా సమర్పించియున్నారు. దాతలకు ఆశీర్వచనం చేయించి, శ్రీ స్వామి వారి శేష వస్త్రంతో సత్కరించడమైనది.




## ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకమ్మకు ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ ఘన నివాళులు



ఐ. పోలవరం జులై 12( జియస్ బి వార్త)శనివారం తుది శ్వాస విడిచిన గాన కోకిల, ప్రముఖ నేపథ్య గాయని ఎస్. జానకమ్మకు ముమ్మిడివరం తెలుగుదేశం పార్టీ ఘన నివాళుల అర్పించారు. జానకమ్మ చిత్రపటానికి పూలమాల వేసి మాజీ ఏ ఎమ్ సి చైర్మన్ గొలకోటి దొరబాబు మాట్లాడుతూ గుంటూరు జిల్లా రేపల్లె మండలం పల్లపట్ల గ్రామం లో జన్మించి భారతీయ సంగీత రంగానికి ఆమె అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. తెలుగు నేలపై జన్మించిన జానకమ్మ ఆరు దశాబ్దాలకు పైగా తన అపూర్వ గానంతో కోట్లాది సంగీతాభిమానుల హృదయాలను గెలుచుకున్నారని బాలమిత్రుల కథ లో( గున్న మామిడి కొమ్మమీద గూళ్ళు రెండు ఉన్నాయి) స్నేహానికి నిర్వచనం అని, పదహారేళ్ళ వయసు చిత్రంలో ( సిరిమల్లె పువ్వా) మంచి ప్రాచర్యం పొందినయని ఆమె పాటలు అందరి హృదయాల్లో నిలిచిపోతాయన్నారు. జానకమ్మ కుటుంబ సభ్యులకు, అభిమానులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ని ప్రార్థించారు. నివాళులు అర్పించిన వారిలో తాడి నరసింహారావు, పొద్దోకు నారాయణరావు,ఆర్ధాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణ కుమార్,కట్ట సత్తిబాబు,చిక్కాల అంజిబాబు, దంగేటి శ్రీనివాస్,మిమ్మితి చిరంజీవి, సబ్బతి డేవిడ్ రాజు,గొల్లపల్లి గోపి, అడబాల సతీష్ కుమార్, ములపర్తి బాలకృష్ణ, గోదసి గణేష్ లు వున్నారు

## సత్యదేవునికి ఘనంగా రధసేవ




అన్నవరం,(జి యస్ బి వార్త),జులై - 12 : కాకినాడ జిల్లా అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి రత్నగిరిపై సత్యదేవునికి ప్రాకార రధసేవ ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు స్వామివారికి ఆలయ ప్రాకార రథసేవ ఘనంగా ప్రారంభించారు. ఈసందర్బంగా అర్చకులు ఇంద్రగంటి సుధీర్ స్వామి, అమ్మవారిని ప్రత్యేక పుష్పాలు, ఆభరణములతో అలంకరించి రధంపై ఆశీనులు గావించి, ప్రత్యేక పూజల అనంతరం చతుర్వేధ మంత్రోచ్ఛరణలు, మంగళ వాయిధ్యాల నడుమ ఆలయ ప్రాకారం చుట్టూ ముమ్మార్లు ప్రదక్షిణ గావించి, రధసేవను అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం పాలకమండలి సభ్యులు పాలచర్ల నాగేంద్ర చౌదరి, జనసేన నాయకులు మేడిశెట్టి సూర్య కిరణ్,ఆలయ ఏఈఓ పెండ్యాల భాస్కర్, అర్చకులు, వేధపండితులు, వ్రతపురోహితులు, దేవస్థానం సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా శ్రీ సత్యనారాయణస్వామివారి కల్యాణం



అమలాపురం జూలై 12 ( జి.ఎస్.బి వార్త )అమలాపురం శ్రీ సత్యసాయి కళ్యాణమండపంలో లోకా స్సమస్తా స్సుఖినో భవంతు ఆధ్యాత్మిక సేవా సంస్థ వారిచే, ప్రముఖ వాస్తు, జ్యోతిష్య, ఆధ్యాత్మిక వేత్త రేలంగి కుమార్ శంకర్ గౌడ్ ఆధ్వర్యంలో లోక కళ్యాణార్థం భారతదేశ ఆర్థికాభివృద్ధి, ఉభయ తెలుగు రాష్ట్రాల దినదినాభివృద్ధి, ప్రజలందరికీ ధన, ధాన్య, ఆరోగ్య సిద్ధి సంకల్పంగా శ్రీ అనంత లక్ష్మి సత్యవతీ దేవి సమేత శ్రీ వీర వేంకట సత్యనారాయణమూర్తి స్వామి వారి దివ్య కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవోపేతంగా జరిగింది. వేద పండితుల వేద మంత్రోచ్చరణ, కన్యాదానం, జీలకర్ర బెల్లంతో దేవతా మూర్తుల వివాహ ఘట్టం, మంగళ సూత్ర ధారణ, తలంబ్రాల సన్నివేశాలకు భక్తులు భక్తి తన్మయత్వం పొందారు. శ్రీ సత్యదేవుని నామ ప్రాధాన్యత, కల్యాణ మహోత్సవంలో వివిధ ఘట్టాల అంతరార్థాలను కుమార్ శంకర్ గౌడ్ వివరించారు. ఏవిధమైన టికెట్ రుసుము, దక్షిణలు, హుండీలు లేకుండా భక్తులకు ఉచితంగా అవకాశం కల్పించారు. స్వామివారి కల్యాణం వీక్షించుటకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసారు. టి.డి.పి నాయకులు పెచ్చెట్టి చంద్రమౌళి గోరుగంతు సీతారామం, వక్కలంక నాని శర్మ, రామేశ్వరపు మణికంఠ, అయినవిల్లి నాగేంద్రకుమార్, గువ్వాల అచ్యుతరామయ్య, పలివెల అప్పారావు, దంగేటి అప్పారావు,పితాని నాని,. జి. తిరుపతి రావు, దంగేటి మహేష్, నల్లా వేణుగోపాలరావు,శ్రీ విజయ త్రిముఖ గణపతి ఆలయ కమిటీ సభ్యులు సేవలు అందించారు. చివరగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

## ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు



ముంబయిలో కుడి భుజానికి శస్త్ర చికిత్స చేయించుకున్న ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ని పరామర్శించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు . కొద్దిసేపటి క్రితం చంద్రబాబు నాయుడు ఆసుపత్రికి చేరుకుని పవన్ కళ్యాణ్ తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు.

# వేళంగిలో ఆర్ఎస్ఎస్ గురుపూజోత్సవం



కరప (జివిస్ బి వార్త) : వేళంగిలో రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘ్‌లో గురుపూజోత్సవాన్ని 1926 నుంచి ప్రతి ఏడాది నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోంది. త్యాగం, సేవకు ప్రతీకగా భావించే కాషాయ ధ్వజాన్ని గురువుగా స్వీకరించిన ఆర్ఎస్ఎస్ స్వయం సేవకులు, వ్యాస మహర్షి జయంతి సందర్భంగా వచ్చే ఆషాఢ పౌర్ణమి రోజున కాషాయ ధ్వజానికి పూజలు నిర్వహించి తను, మన, ధన సమర్పణ చేస్తారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెర్ల విజయ భారతి హాజరయ్యారు. ఆర్ఎస్ఎస్ సామాజిక సమరసత ప్రాంత సంయోజక్ రాజా రామచంద్ర, బొండా వెంకన్నారావు పాల్గొని సంఘ్ సిద్ధాంతాలు, గురుపూజోత్సవం విశిష్టతను వివరించారు. కార్యక్రమాన్ని దొంతుకుర్తి ఈశ్వరశర్మ ధ్వజారోహణంతో ప్రారంభించగా, ఎర్ర విక్రం సంఘ్ గీత్ ఆలపించారు. ఈ కార్యక్రమంలో యానాం ఖండా వి. రామారావు , సలాది నాగేశ్వరరావు, ఉంగరాల శ్రీనివాస్ , బి. మూర్తి , సానా శ్రీను , ఖండవల్లి గుణ , కుంచె సుబ్రహ్మణ్యం , ఇళ్ల అదేశ్ తదితరులు పాల్గొన్నారు.

# "అమృత్ భారత్" పనులను పరిశీలించిన రైల్వే జీఎం




సామర్లకోట, జులై 12, జి ఎస్ బి వార్త : సామర్లకోట రైల్వే స్టేషన్‌లో "అమృత్ భారత్" స్టేషన్ అభివృద్ధి పథకం కింద జరుగుతున్న పనులను దక్షిణ కోస్తా రైల్వే జనరల్ మేనేజర్ సందీప్ మాథుర్ పరిశీలించారు. ప్రత్యేక రైలులో సామర్లకోటకు చేరుకున్న ఆయన అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించి, పనుల తీరు పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం స్టేషన్‌లో చేపడుతున్న ప్లాట్‌ఫారం ల విస్తరణ, అదనపు భవనాల నిర్మాణం, సర్క్యులేటింగ్ ఏరియా, కార్ల పార్కింగ్, వాహనాల పార్కింగ్, వెయిటింగ్ హాల్స్, మరుగుదొడ్లు, బుకింగ్ హాల్, రైల్వే భద్రతా పరికరాల ఏర్పాట్లు తదితర పనులను జీఎం సందీప్ మాథుర్ పరిశీలించారు. ఈ సందర్భంగా పనులను మరింత వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విజయవాడ రైల్వే డివిజన్ డీఆర్ఎం మోహిత్ సోనాకియా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సామర్లకోట రైల్వే స్టేషన్‌కు చేరుకున్న జీఎం సందీప్ మాథుర్, డీఆర్ఎం మోహిత్ సోనాకియాలకు స్టేషన్ మేనేజర్ ఎం రమేష్ స్వాగతం పలికారు. జీఎం వెంట సీనియర్ డీఈఎన్ (కోఆర్డినేషన్) సూర్యప్రకాశరావు, సీనియర్ డీసీఎం ప్రశాంత్ కుమార్, సీనియర్ డీవోఎం సురేష్ రెడ్డి, పీసీసీఎం సాంబశివరావు, పీసీఈ రాజ్‌కుమార్, సీనియర్ డీఈఈ (ఎలక్ట్రికల్) భానుప్రకాష్, హెల్త్ ఇన్‌స్పెక్టర్ కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.


# గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ జిల్లా సమావేశం



అమలాపురం జులై 12 ( జి ఎస్ బి వార్త )అమలాపురం శ్రీశ్రీ విశ్వబ్రాహ్మణ స్వర్ణకార కళ్యాణ మండపంలో గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ సమావేశం అప్రైజర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు నలమాటి కొండల రావు ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది అమలాపురం రీజియన్ గోల్డ్ అప్రైజర్స్ యూనియన్ అధ్యక్షులుగా కర్లోజు ఉదయ భాస్కర్. ఖరణికాన బాబు. కోశాధికారిగా అప్పా బత్తుల శ్రీనివాస్ జాయింట్ సెక్రెటరీగా టేకి శివకుమార్. మరి కొంతమందిని కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

# డిప్యూటీ సీఎం కొణిదెల పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు

కరప (జివిస్ బి వార్త) : జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ విజయవంతంగా శస్త్రచికిత్స చేయించుకున్న నేపథ్యంలో, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకుని తిరిగి ప్రజాసేవలో మరింత ఉత్సాహంతో పాల్గొనాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదేశాల మేరకు ఆదివారం కరప శ్రీ రామలింగేశ్వర స్వామి శివాలయంలో జనసేన నాయకులు భోగిరెడ్డి కొండబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన కరప మండల నాయకులు యాళ్ల వీర వెంకట సత్యనారాయణ (పండు) , జనసేన పార్టీ స్టేట్ జాయింట్ సెక్రెటరీ భోగిరెడ్డి గంగాధర్ , కరెడ్ల మణికంఠ ,బిద్ది వీరబాబు, మామిడిపల్లి గంగాధర్ , సురేష్ జనసేన పార్టీ నాయకులు,జనసైనికులు పాల్గొని పవన్ కళ్యాణ్ సంపూర్ణ ఆరోగ్యం కోసం భగవంతుడిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. ప్రజాసేవనే పరమావధిగా భావించి తన జీవితాన్ని అంకితం చేసిన నాయకుడు పవన్ కళ్యాణ్ త్వరగా కోలుకుని, మరింత శక్తి, ఉత్సాహంతో ప్రజలకు అయన సేవలు అందించాలని పరమేశ్వరుడిని వేడుకున్నాము.



# కేసుల పురోగతికి కృషి చెయ్యాలి...

## సమీక్షా సమావేశంలో డి ఎస్పీ ఆదేశం



పెద్దాపురం, జూలై 12, జి ఎస్ బి వార్త : పెద్దాపురం డీఎస్పీ కార్యాలయంలో జూన్ మాస నేర సమీక్షా సమావేశం డీఎస్పీ ఎబిజీ తిలక్ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ పరిధిలోని సీఐ లు చెన్న కేశవ రావు, సూరి అప్పారావు, తిరుపతి రావు, ఆళ్ల కృష్ణ భగవాన్, వై ఆర్ కె శ్రీనివాస్, తుని రూరల్, ప్రత్తిపాడు, జగ్గంపేట , పెద్దాపురం మరియు ఐడబల్యూ లు, ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో లాంగ్ పెండింగ్ కేసులపై డిఎస్పీ సమీక్ష జరిపి తక్షణ పరిష్కారానికి కృషి చెయ్యాలని సూచించారు. అలాగే అన్ని గ్రేవ్ కేసులలో దర్యాప్తు పురోగతిని ప్రశ్నించారు. నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేయాలని ఆదేశించారు. ఫైర్ క్రాకర్స్ అక్రమ రవాణా, తయారీ, అమ్మకాలు లేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని తగిన నిఘా పెట్టి ఎప్పటికప్పుడు చెక్ చేస్తూ ఉండాలని, అన్ని అండర్ ఇన్వెస్టిగేషన్ లో ఉన్న కేసులలో పురోగతిపై సమీక్షించారు. వాటిని తక్షణం ఫైనలైజేషన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే సోషల్ మీడియా కేసులు, వాటి పురోగతి , ప్రాపర్టీ కేసులు, వాటి పురోగతి, దొంగతనాలు జరగకుండా ఈ - బీట్ సిస్టం సర్వ్ చేయాలని, యుఐ ప్రాపర్టీ కేసుల డిటెక్షన్ గురించి క్రైమ్ టీం లను ఏర్పాటు చేసి ఆ కేసులను డిటెక్ట్ చేయాలని, మిస్సింగ్ కేసులలో పురోగతిని డిఎస్పీ సమీక్షించారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రత గురించి ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రౌడీ షీటర్లు , రిప్రాప్ పర్సన్స్ మీద ఉక్కు పాదం మోపాలని, ఓవర్ లోడ్ స్కూల్ ఆటోలపై తగిన చర్యలు తీసుకోవాలని, ఎక్కడా ర్యాగింగ్, ఈవిటీజింగ్ లేకుండా పాఠశాలలు, కళాశాలల వద్ద పెట్రోలింగ్ పెంచాలని , రోడ్డు ప్రమాదాల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు బుక్ చేయాలని డిఎస్పీ తిలక్ ఆదేశించారు.

# ధర్మవరంలో పేకాట స్థావరంపై దాడి చేసి ఎనిమిది మంది అరెస్ట్



ప్రత్తిపాడు (జివిస్ బి వార్త) : ప్రత్తిపాడు ఎస్ఐ లక్ష్మీకాంతం తన సిబ్బందితో కలిసి ధర్మవరం శివారులో పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి నిర్వహించారు. ఈ దాడిలో పేకాట ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుంచి రూ. 9,700 నగదుతో పాటు పేకముక్కలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఆంధ్రప్రదేశ్ గేమింగ్ యాక్ట్ లోని సెక్షన్ 9(1) కింద కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ మాట్లాడుతూ.. జిల్లాలో పేకాట, జూదం, మాదకద్రవ్యాలు మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలు తమ ప్రాంతాల్లో ఇటువంటి కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 112 నెంబర్ కు కాల్ చేసి సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# నేడు సీఎం పర్యటన ఏర్పాట్లు పై కలెక్టర్ పరిశీలన



అమలాపురం జూలై 12:(జివిస్ బి వార్త) : సోమవారం ముఖ్య మంత్రి పర్యటన లో భాగంగా పిచ్చుక లంక సభా ప్రాగణం, 17 బ్యారేజ్ గేట్ల శంఖుస్థపన వేమగిరి హెలిపాడ్ స్థలం ఆదివారం జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్, జిల్లా జాయింట్ కలెక్టర్ వై ఖోమ్ నైడియా దేవి తో కలిసి పర్యటించి జిల్లా అధికారులకు దిశా నిర్దేశం చేసారు. అనంతరం పిచ్చుక లంక సభా ప్రాగణం లో జిల్లా అధికారులకు సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశం లో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని తెలిపారు. అదేవిధంగా ధవళేశ్వరం బ్యారేజ్ గేట్ల మార్పు-మరమ్మత్తు పనులకు పైలాన్, రైతులతో ముఖాముఖి కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లుపై ఎప్పటికి కప్పుడూ పరిశీలించాలని తెలిపారు. ముఖ్యమంత్రి ధవళేశ్వరం వద్ద సుమారు రూ. 150 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న 17 బ్యారేజ్ గేట్ల పూర్తిస్థాయి మార్పు, మరమ్మత్తు పనులకు పైలాన్ ఆవిష్కరించనున్నారని, అనంతరం ఆత్రేయపురం మండలం పిచ్చుకలంక గ్రామంలో సుమారు 6 వేల మంది రైతులతో నిర్వహించే ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారని కలెక్టర్ తెలిపారు. ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సూచించారు. పర్యటనలో ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా శాఖల మధ్య సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ధవళేశ్వరం జలవనరుల శాఖ కార్యాలయంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి శాఖలవారీగా విధులు, బాధ్యతలను కేటాయించారు. జలవనరుల శాఖ అధికారులు పైలాన్ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, రవాణా శాఖ అధికారులు సభా ప్రాంగణం, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి, రెండు అంబులెన్సులను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. వ్యవసాయ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు రైతుల సమీకరణ, కూర్చునే ఏర్పాట్లను పకడ్బందీగా చేపట్టాలని, జిల్లా పౌర సరఫరాల శాఖ రైతులకు భోజనం, తాగునీరు, అల్పాహారం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, జలవనరుల శాఖ హెడ్‌వర్క్స్ పర్యవేక్షక ఇంజనీర్ శ్రీనివాస్, ఆర్డీఓ జి.వి.వి. సత్యనారాయణ, వ్యవసాయ శాఖ అధికారులు, డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ డి. రాంబాబు, ఆర్ అండ్ బి సూపరింటెండింగ్ ఇంజనీర్ బి. రాము, జలవనరుల శాఖ ఇంజనీర్లు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# లాడ్జిల్లో ప్రత్యేక తనిఖీలుతో అక్రమ కార్యకలాపాల పై నిఘా



కాకినాడ, (జివిస్ బి వార్త ) : కాకినాడ జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ, అక్రమ కార్యకలాపాల నియంత్రణ మరియు అనుమానాస్పద వ్యక్తులను గుర్తించే చర్యల్లో భాగంగా ఆదివారం జిల్లావ్యాప్తంగా పలు లాడ్జిలు, అతిథి గృహాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా జూదం, వ్యభిచారం వంటి అక్రమ కార్యకలాపాలు జరుగుతున్నాయా అనే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే పాస్‌పోర్టు లేదా ఇతర చెల్లుబాటు అయ్యే పత్రాలు లేకుండా విదేశీయులు బస చేస్తున్నారా, అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, సంఘవిద్రోహ లేదా ఉగ్రవాద కార్యకలాపాలకు సంబంధించిన ఆనవాళ్లు ఏమైనా ఉన్నాయా అనే కోణాల్లో క్షుణ్ణంగా పరిశీలించారు. లాడ్జి నిర్వాహకులు బసకు వచ్చే ప్రతి అతిథి పూర్తి వివరాలు, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని, సీసీ కెమెరాలను నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని, పోలీసుల తనిఖీలకు పూర్తిస్థాయిలో సహకరించాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించిన లాడ్జి నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీ ఎం.వి. నాగ దుర్గారావు ఆధ్వర్యంలో కాకినాడ పట్టణంలోని పలు లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అతిథుల నమోదు వివరాలు, గుర్తింపు పత్రాలు, సీసీ కెమెరాల పనితీరు, భద్రతా ప్రమాణాలను పరిశీలించి లాడ్జి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ శ్రీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ గారు మాట్లాడుతూ, జిల్లాలో ప్రజల భద్రతకు విఘాతం కలిగించే, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు అవకాశం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇలాంటి ప్రత్యేక తనిఖీలు జిల్లావ్యాప్తంగా నిరంతరం కొనసాగుతాయని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో ఏవైనా అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 112కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని కోరారు.

# సత్యదేవున్ని దర్శించిన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే



అన్నవరం,(జి ఎస్ బి వార్త),జులై - 12 : అన్నవరం శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామివారి సన్నిధికి ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం సత్యనారాయణ స్వామి ఆలయానికి పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బోలిశెట్టి శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో విచ్చేసారు. ఈసందర్భంగా స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి మల్లాడి దంపతులకు ఆస్థాన వేదపండితులు వేధాశీర్వచనం అందజేసారు. ఆలయం వద్ద వీరికి ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అధికారులు వీరికి స్వామివారి శేష వస్త్రం,ఫొటో, ప్రసాదం అందజేసారు. కార్యక్రమంలో తాడేపల్లిగూడెం కూటమి ప్రభుత్వ నాయకులు ఉన్నారు.

# అత్తా--కోడళ్ల మధ్య ఘర్షణ.. స్లీపింగ్ టాబ్లెట్లు మింగిన అత్తను కాపాడిన పోలీసులు



కాకినాడ, (జివిస్ బి వార్త ) : కాకినాడ లో జగన్నాథపురంలో అత్తా--కోడళ్ల మధ్య జరిగిన ఘర్షణ నేపథ్యంలో ఓ మహిళ స్లీపింగ్ టాబ్లెట్లు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం జగన్నాథపురానికి చెందిన గేదెల హేమలతకు శుక్రవారం రాత్రి తన కోడలితో మాటామాటా పెరిగి వాగ్వాదం జరిగింది. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన హేమలత గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుని స్లీపింగ్ టాబ్లెట్లు మింగింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అత్యవసర సేవల 112 నంబర్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న రాత్రి విధుల్లో ఉన్న కాకినాడ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ మజ్జి జగదీష్,హోంగార్డు వీరభద్రరావు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని లోపల నుంచి లాక్ చేసిన గది తలుపును బలవంతంగా తెరిచి హేమలతను సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. అనంతరం ఆమెను హుటాహుటిన సమీపంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సకాలంలో స్పందించిన పోలీసుల కారణంగా హేమలత ప్రాణాపాయం నుంచి బయటపడినట్లు సమాచారం. వెంటనే స్పందించి ఆమె ప్రాణాలను కాపాడిన పోలీసులకు కుటుంబ సభ్యులు,పలువురు కృతజ్ఞతలు తెలిపారు.

# సినిమా థియేటర్ల లో "ఎస్ ఐ ఆర్" పై అవగాహన దృశ్యాలు తప్పక ప్రదర్శించాలి

## థియేటర్ల యాజమాన్యాలకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు

కాకినాడ,జూలై 12: (జివిస్ బి వార్త) : ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ ఐ ఆర్) కార్యక్రమం పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు జిల్లాలోని అన్ని సినిమా థియేటర్ల లో ఈనెల 14వ తేదీ వరకు ప్రచార దృశ్యాలు,చిత్రాలను తప్పకుండా ప్రదర్శించాలని థియేటర్ యాజమాన్యాలు, అధికారులను జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ ఎం. ఎన్. హరేంధిర ప్రసాద్ ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వారి కార్యాలయ ఆదేశాల మేరకు ఇప్పటికే మేనేజింగ్ డైరెక్టర్,ఏపి స్టేట్ ఫిలిం టెలివిజన్ అండ్ థియేటర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా థియేటర్ యాజమాన్యాలకు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై వీడియో లను పంపడం జరిగిందని తెలిపారు. అలాగే ఆయా మండలాల పరిధి లోని రెవెన్యూ అధికారులు కూడా సినిమా థియేటర్ ల యాజమాన్యం వారికి సూచనలు అందించాలన్నారు. ప్రతి సినిమా ప్రారంభానికి ముందు అలాగే విరామ సమయంలో ఈనెల 14వ తేదీ వరకు తప్పనిసరిగా ఎస్ ఐ ఆర్ పై అవగాహన దృశ్యాలు నిరంతరాయంగా ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లేందుకు అన్ని సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు..

Printed&published by on behalf (owner) Editor : GUNIPE SOBHAN BABU , Divya Publications, 4-160, DIWAN THOTA, PENUGUDURU, KAKINADA, ANDHRA PRADESH - 533016. printed at Rainbow printers ,6-84, SAIBABAPUNTHA ROAD, HUKUMPETA, RAJAHMUNDRY RURAL, EAST GODAVARI, ANDHRA PRADESH - 533107.RNI APBIL/26/A4072.email sobhangunipe@gmail.com.cell 9848899351.